


# దొరికింది

— ముసునూరి వీరయ్య శాస్త్రి


రోహిణీ కార్తె రోజులు.

ఎండలు విరగ కాస్తున్నాయి. ప్రతి సంవత్సరం కట్టేసినట్లే కాలవలు కట్టేశారు. అయినా, ఆ వూరి కాలవ కట్టేసినా గుడి దగ్గరున్న రేవులో మాత్రం నీళ్ళు దండిగా వుంటాయి. అది గుండాలరేవు. మిగతా ప్రదేశంలో మోకాలికి మించి నీరుండదు.

ఆ రోజు—

సూర్యుడు వుదయించకుండానే ఆ వూరి జనం కాలవ చేరుకొన్నారు. కాలవలో చేపలు పడుతున్నారు. ఎవరి శక్తి వారిది. కర్రలు పుచ్చుకొని చేప కనిపించగానే నీళ్ళమీద తపీమని బాది, అది చావగానే బుట్టలో వేసుకొనేవాళ్ళు, వలలు వేసి ఘనంగా చేపలు పొందేవాళ్ళు, గట్టునే నిలబడి పెద్ద చేప పడుతుందేమో, డబ్బిచ్చి తన్నుకుపోవచ్చునని ఎదురుచూసే వాళ్ళతో కాలవ రెండు గట్లూ కలకలలాడి పోతున్నాయి. చిన్నా, పెద్దా, ఆడా, మగా అనే వివక్షత లేకుండా చేపల కోసం కుస్తీ పడుతున్నారు.

శివుడు అప్పుడే వచ్చాడు అతని చేతిలో కర్ర, గిన్నే వున్నాయి. కాలవలో దిగడానికి సంశయిస్తున్నాడు. అతనికి పదేళ్ళుంటాయి. సన్నగా నల్లగా వుంటాడు. ముఖంలో చురుకు






దనం కంటే, భయమే యెప్పుడు కనిపిస్తుంటుంది. కొన్ని క్షణాలపాటు గట్టున నిలబడి, నీళ్లల్లో జరుగుతున్న సంరంభాన్ని చూస్తూ అనుభవంలేని తనెలా చేపలు పట్టాలో అవగాహన చేసుకొంటున్నాడు. ఎండముదురుతోంది. పావుగంట గడిచింది. చేపలతో బుట్టలు నింపుకొని బయటకొచ్చి అమ్మేసి మళ్ళీ నీళ్ళల్లోకి వెడుతున్నారు. శివుడు కాసేపలాగే నిలబడి, ఆనక ధైర్యంతెచ్చుకొని మెల్లగా మెట్టు దిగాడు గుండంరేవు కవతల. అతని కళ్ళు చురుగ్గా పని చేస్తున్నాయి. నీళ్ళలో టపటప చప్పుళ్ళు దీపావళినిగుర్తుకు తెస్తున్నాయి. కనిపించినచేపని కొడుతున్నాడు అయితే, యే ఒక చేప దెబ్బకందడం లేదు. పట్టువదలని విక్రమార్కుడిలా తనప్రయత్నం సాగిస్తూనే వున్నాడు. అయినా ఫలితం శూన్యం. కాలం గడిచేకొద్దీ అలసట పెరుగుతోంది. చేపలు దొరకలేదనే బాధకంటే, యింటి దగ్గర తల్లేమంటుందోన్న భయమే శివుణ్ని వూపిరి తీయనీయడంలేదు. పైకి, నిలబడి ధైర్యంగా వున్నట్లున్నాడేగానీ, లోలోపల వణికిపోతున్నాడు. అంతలో కాళ్ళి కింద ఏదో తగిలింది. అడుగు తీశాడు. ఒక పెద్ద చేప పైకి లేచింది. వెంటనే గట్టిగా కర్రతో కొట్టాడు. తగలవలసిన చోట తగలడంవల్ల, చేపకి తల తిరిగింది. చేపని చేతిలోకి తీసుకోబోతూండగా, బలమైన చేయి మరొకటి వచ్చి ఆ చేపను లాక్కుంది.

'ఈ చేప నాది' అన్నాడు శివుడు.

'ఏడిసావ్, యిది నేను అక్కడ కొట్టిన చేప' అన్నాడా వ్యక్తి.

'కాదు' శివుడికి ఏడుపు వస్తోంది. ఆ వ్యక్తి చేతిలోని చేప లాక్కోబోయాడు.

'ఓరి ఎదవా! నా చేతిలో చేప లాక్కుందామనే!' అనేసి వెళ్ళిపోయాడతను చేప పుచ్చుకొని.

శివుడు బిక్కముఖం వేసుకొని, చూస్తూ నిలబడిపోయాడు. కాసేపు తంటాలుపడ్డాడు. రెండు చేపపిల్లలు సంపాదించగలిగాడు. ఎండ బలిసింది. జనం వెళ్ళిపోతున్నారు. నీళ్ళు బురదై కంపు కొడుతున్నాయి. మెల్లగా శివుడు గట్టెక్కాడు. ఇంటివైపు అడుగులు వేస్తున్నాడు. కడుపులో ఆకలి దొలిచేస్తోంది. ఇంటికొచ్చాడు. గుమ్మంలో తల్లి ఎదురై,

'ఏరా! శివా! చేపలు పట్టుకొచ్చావా!' అంది ఆత్రుతగా.

శివుడు భయం భయంగా తల్లి వంక చూస్తూ చేతిలో గిన్నె యిచ్చాడు ఆమె గిన్నె లోపలికి చూసి, కోపంగా గిన్నె గిరవాటు వేసింది

'ఎదవా, ఎంతో మురిపెంగా రెండు చేపలు తెచ్చాడు తిండి తినడానికి తప్ప దేనికీ పని చెయ్యవు నువ్వు'

శివుడు తల వంచుకున్నాడు.

"ఆ సుబ్బిగాడు, ఎంకడు, రాముడు చూడెల్లి, యెన్నెన్ని చేపలట్టుకొచ్చారో. ఎదవన్నరెదవా, సిగ్గులేదూ, ఎందుకొచ్చిన బ్రతుకురా, యెల్లి చావు." అంది కోపంగా.

శివుడు తల దించుకునే వున్నాడు తల్లికి వినిపించకుండా యేడుస్తున్నాడు.


'ఈవేళ నీక్కూడెట్టను యెల్లి యెవరితో చెప్పుకుంటావో చెప్పుకో" అనేసి విసురుగా లోపలికెళ్ళిపోయిందామె

"అమ్మా! ఆకలవుతోందే' బయటనుంచి శివుడు బాధగా అడిగాడు.

ఆమె హృదయం కరగలేదు. కొడుకు పనికిరాని వాడుగా తయారౌతున్నాడన్నదే ఆమె బాధ. అంతే కాకుండా ప్రక్కింటి వాళ్ళు డబ్బు కూడా బాగా సంపాదించారు. ఆ కుర్రాళ్ళు కూడా శివుడు తోటివాళ్ళే.

"ఆకలయితే చావు చచ్చినా నీకీయేల కూడెట్టను' ఖచ్చితంగా అనేసిందామె లోపల్నుంచి.

శివుడు మెల్లగా అక్కడే జాగా చూసుకుని కూర్చున్నాడు. బురద నీళ్ళల్లోంచివచ్చాడేమో నీళ్ళెండిపోయి, శరీరం మట్టితో పెళు సెక్కింది. ముఖం నీరసంగా వుంది. ఒక విధమైన నిర్లిప్తత అతనిలో చోటుచేసు కుంది. పావుగంటలాగే కూర్చున్నాడు. తర్వాత లేచి బయటకొచ్చాడు ఏదో చెయ్యాలని... అది చేసేసి తల్లిని తృప్తిపరచాలనుందతనికి. చేపలెలా సంపాదించాలి? అనే ప్రశ్నతో నడు స్తున్నాడు. చేపలతోనే తిరిగి యింటి గుమ్మ మెక్కాలి—అనే నిర్ణయంతో నడుస్తున్నాడు. అలా నడచి దేవాలయం దగ్గరికి చేరుకున్నాడు. నీరసంతో కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. చాలాసేపు ఆలో చించాడు. 'రాత్రి పడితే ఎవరూ వుండరు. అప్పుడు హాయిగా చేపలు పట్టుకోవచ్చు. చీకట్లో చేపలు కనిపించవగ్గా! మరెలా! మిట్టమధ్యాహ్నం పడితేసరి ఎవరూ వుండరు. అదే మంచిది' అని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయ మతనిలో నూతనోత్సాహం కలిగిం చింది. తప్పకుండా చేపలు దొరుకుతాయన్న ధైర్యమతనిలో నిండుగా కలిగింది సమయం కోసం ఎదురు చూస్తున్నాడు. సూర్యుడు నడినెత్తికి వచ్చేసరికి లేచి నిలబడ్డాడు. దాహం వేసింది. కొద్ది దూరంలో వున్న యింటికెళ్ళి దాహం తీర్చుకువచ్చాడు కర్ర పుచ్చుకుని కాలవలో దిగాడు. ఒక్కసారి నీటిలో కలకలం పుట్టించాడు. ఒక్క చేప కనబడలేదు! కాస్త ముందుకు వెళ్ళాడు. మళ్ళీ కలకలం పుట్టించాడు! ఒకమాదిరి చేప కనబడింది టపీమని బాదాడు. అది శివుడి చేతిలో పడింది. దాంతో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో తీవ్రంగా గాలించడం మొదలు పెట్టాడు కలకలం మళ్ళీ పుట్టించాడు. అంతే, ఒక పెద్ద చేప అతని దృష్టిలో పడింది కొట్టాడు. దెబ్బ తగల్లేదు. ముందు కెళ్ళింది. శివుడు ముందుకెళ్ళాడు. మళ్ళీ కనిపించింది చేప. అది నీళ్ళలో ముందు కురికింది. శివుడు గబగబా ముందుకెళ్ళాడు కొట్టడానికి. అంతే, ఒక్కసారి నీళ్ళల్లో మునిగిపోయాడు. అక్కడే గుండముందనే విషయమతనికి తెలియదు. ఎవరూ చూడలేదు కూడా లేదక్కడ. నింగిలో సూర్యుడికి తప్ప మరె వ్వరికీ తెలియదు శివుడు నీళ్ళలో మునిగి పోయాడని.




* * *

చీకటి పడింది.

నర్సమ్మకి ఆందోళన ప్రారంభమైంది, చీకటి పడినా కొడుకు రాకపోయేటప్పటికి. భర్త చూస్తే పట్నం వెళ్ళాడు. కంగారుగా వుందామెకు వెతకడానికి బయల్దేరబోతోంది.

"ఏమ్మో! నర్సమ్మా, కొంప మునిగి పోయిందే తల్లీ!" అంటూ వచ్చింది ప్రక్కింటి గౌరి.

"ఏంటే!"

"ఏంటని అడుగుతావేంటే తల్లీ! నీ కొడుకు కాలవలోపడి చచ్చిపోయాట్ట గుండం రేవులో తేలి వున్నాట్ట!" అంది.

అంతే! నర్సమ్మ గుండెలు బాదుకుంటూ పరిగెత్తింది. దిక్కులు పిక్కటిల్లేలా ఏడుస్తోంది. గుండం రేవు చేరికొంది.

"అయ్యో, నా బిడ్డా!" అని బావురు మంది. నీళ్ళల్లో తేలుతున్న కొడుకును చూసి.

"నా బిడ్డని నేనే చంపుకున్నానరో!" అంటూ తల బాదుకొంటోంది. ఎవరూ ఆమెను ఆపలేక పోతున్నారు. శివుడి శవాన్ని తీసుకువచ్చారు నర్సమ్మ, కొడుకు శవాన్ని వళ్ళోకి తీసికుంది. వళ్ళంతా తడిమింది. లాగుజేబు దగ్గర ఏదో తగలటంవల్ల జేబులో చేయి పెట్టి, లోపల్నుండి బయటికి తీసింది. అది చచ్చిన చేప. దాన్ని చూసేసరికి మరింత దుఃఖం వచ్చిందామెకు.

"నేను గుండంలోపడి చచ్చిపోతాను. నేను బతకలేను దేవుడోయ్" అని లేవబోయింది. అక్కడున్నవారందరూ గట్టిగా పట్టుకుని నేలమీద కుదేసి కూర్చోపెట్టారు.

మాతృ హృదయపు బాధని అర్థం చేసికుని, నర్సమ్మవైపు సానుభూతిగా చూస్తున్న అక్కడి ఆడవాళ్ల కళ్ళ వెంబడి కన్నీరు జలజలా రాలుతోంది. రాబోయేది వూహించక, పిల్లలపై నోరు పడేసుకుని, ఆనక ఘోరం జరిగాక తల్లడిల్లిపోయే పేద మాతృ హృదయాలెన్నో ఈ జగతిలో?! అందుకే ముందు చూపు అవసరం.